


**కాల్పుల విరమణను స్వాగతించిన పోప్**

వాటికన్ సిటీ: నూతన పోప్ లియో 14, అమెరికన్ కార్డినల్ రాబర్ట్ ప్రివోస్ట్ పాంటిఫ్‌గా తన తొలి ఆదివారం సందేశాన్ని వినిపించారు. భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ అవగాహన కుదరడాన్ని స్వాగతించారు. ఇరు దేశాల మధ్య శాశ్వతంగా శాంతి నెలకొంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీజ్‌ఫైర్‌పై నెటిజన్ల ఫైర్

- కాల్పుల విరమణపై సోషల్ మీడియాలో చర్చ
- మోదీ సర్కారుపై నెటిజన్ల అసంతృప్తి
- భారత ఇమేజ్‌ను దెబ్బతీశారని ఆగ్రహం
- మన సైన్యానిదే పైచెయ్యి అయినప్పటికీ ఎందుకు వెనుకడుగు వేశారని నిలదీత



ఢిల్లీ, మే 11: పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి అంగీకరించడంపై మోదీ సర్కారుపై సోషల్‌మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. అమెరికా ఒత్తిడికి బీజేపీ ప్రభుత్వం తలొగ్గిందని నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. భారత ఇమేజ్‌ను దెబ్బతీశారంటూ మండిపడ్డారు. యుద్ధంలో మొదటి నుంచీ పైచెయ్యి మనదే అయినప్పటికీ, కాల్పుల విరమణకు అంగీకరించాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. కాల్పుల విరమణకు ఇది సరైన సమయం కాదని చాలామంది అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం తీసుకునేలా ఎవరు ప్రేరేపించారని, అమెరికా మధ్యవర్తిత్వానికి ఒప్పుకొని, దాని ముందు మోకరిల్లాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నల వర్షం కురిపించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్యవర్తిత్వంతో భారత్-పాక్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం విదితమే. ఈ మేరకు శనివారం ట్రంప్ సోషల్ మీడియాలో వెల్లడించిన తర్వాత భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ కూడా కాల్పుల విరమణకు అంగీకరించినట్టు తెలిపారు. ఆ మరుక్షణమే ఈ విషయం దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది.

### వాళ్లు బాంబులు వేస్తుంటే.. శాంతి వచనాలా?

మోదీ సర్కారు చర్యపై పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దశాబ్దాలుగా పాక్ మనపై బాంబులు, మారణ హోమాలు, యుద్ధాలు చేస్తున్న తర్వాత కూడా మనం వారికి మర్యాదపూర్వకంగా కాల్పుల విరమణను ప్రతిఫలంగా తిరిగి ఇచ్చాం. తెలివైన వ్యూహం. మీ శత్రువును గట్టిగా కౌగిలించుకోండి, తద్వారా వారు మిమ్మల్ని ఇంకా బాగా చంపగలరు' అని ఓ యూజర్ సెటైర్ వేశారు. భారత్ తన గ్లోబల్ ఇమేజ్‌ను దెబ్బతీసుకున్నదంటూ ఓ యూజర్ ఫైర్ అయ్యారు. 'మొదటిసారి భారత్ ఎలాంటి వ్యూహాత్మక ప్రయోజనం పొందకుండానే కాల్పుల విరమణకు అంగీకరించింది. అది కూడా అమెరికా అధ్యక్షుడి ఒత్తిడి మూలంగా. ఇది దౌత్యపరమైన ఎదురుదెబ్బ మాత్రమే కాదు, గ్లోబల్ పవర్‌గా ఎదుగుతున్న భారత్ ఇమేజ్‌కు కూడా పెద్ద దెబ్బే' అని ఓ నెటిజన్ ఘాటుగా స్పందించారు.

### కాల్పుల విరమణ శాశ్వత శాంతికి తోడ్పడుతుందా?

ప్రధాని మోదీ ప్రజల నమ్మకం కోల్పోయారని ఓ నెటిజన్ తీవ్రంగా స్పందించారు. 'ప్రధాని మోదీ తన జీవితంలో అతి పెద్ద తప్పు చేశారు. ఆయన ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారు. ఇకపై ఆయనకు ఓటు వేయను' అని పేర్కొన్నారు. 'ఈ కాల్పుల విరమణ శాశ్వత శాంతికి తోడ్పడుతుందా? పాక్ మళ్లీ చొరబాట్లను ప్రోత్సహించదని గ్యారెంటీ ఇవ్వగలరా? ఇకపై అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోరని మోదీ ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుందా? పహల్గాం ఘటన పునరావృతం కాకుండా నిరోధించగలరా? తమ ఆప్తులను కోల్పోయిన వారి గాయాలు ఎప్పటికైనా మానుతాయా? టూరిజం సురక్షితమేనా?.. వీటన్నింటికి సమాధానం అవును అయితే శాంతి అర్థవంతంగా ఉంటుంది' అని ఓ నెటిజన్ ప్రశ్నల వర్షం కురిపించారు.

# విజయం అంచుల్లో ఉండి.. ఓటమిని ఒప్పుకుంటున్నాం!

- భారత్‌కు ఇదొక అలవాటుగా మారింది
- పాక్‌పై పైచేయి సాధించిన తర్వాత కాల్పుల విరమణకు ఎందుకు ఒప్పుకున్నట్టు?
- గతం నుంచి పాఠాలు నేర్చుకోకుండా అవే తప్పులు
- మోదీ ప్రభుత్వంపై జియో స్ట్రాటజిస్ట్ బ్రహ్మ చెల్లానే విమర్శలు



హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందంపై ప్రముఖ జియో స్ట్రాటజిస్ట్ బ్రహ్మ చెల్లానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా ఆయన ఇండియాటుడేతో మాట్లాడుతూ.. కాల్పుల విరమణకు మోదీ ప్రభుత్వం ఒప్పుకుంటుందని ఊహించలేదన్నారు. 'విజయం అంచుల వరకు వెళ్లి.. ఓటమిని ఒప్పుకోవడం భారత్‌కు అలవాటైంది' అని వ్యాఖ్యానించారు. శనివారం ఉదయం పాకిస్థాన్ సైన్యం సరిహద్దు వైపు కదిలిందని, భారత సైన్యం కూడా హై అలర్ట్‌లో ఉన్నదని, దీంతో యుద్ధం తథ్యం అనేస్థాయిలో వాతావరణం వేడెక్కిందన్నారు. కానీ అకస్మాత్తుగా కాల్పుల విరమణ ప్రకటన వెలువడిందని గుర్తు చేశారు. 'ప్రస్తుత పరిస్థితులు భారత్‌కు చాలా అనుకూలంగా ఉన్నాయి. పాకిస్థాన్ సైనిక శక్తి డొల్లతనం బయటపడింది. పాకిస్థాన్ భారీ సంఖ్యలో డ్రోన్లు, మిస్సైళ్లు ప్రయోగించగా, భారత్ సమర్థవంతంగా అడ్డుకున్నది. ఇదే సమయంలో భారత సైన్యం పరిమిత సంఖ్యలో మిస్సైళ్లు, డ్రోన్లను ప్రయోగించి లక్ష్యాలను ఛేదించగలిగింది. దీంతో పాకిస్థాన్ వైమానిక దళం డొల్లతనం బయటపడింది. వారి సైనిక శక్తి గురించి ఇన్నాళ్లు ప్రచారం చేసుకున్న దానికన్నా చాలా బలహీనంగా ఉన్నదని తేలిపోయింది' అని పేర్కొన్నారు. ఇలా స్పష్టంగా భారత సైన్యం పై చేయి సాధిస్తున్న సమయంలో కాల్పుల విరమణకు మోదీ ప్రభుత్వం ఎందుకు ఒప్పుకున్నదని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. 'విజయం అంచున ఉన్నప్పుడు వెనక్కి తగ్గే సుదీర్ఘ భారత రాజకీయ ప్రస్థానానికి ఇది నిదర్శనంగా నిలుస్తున్నది. విజయం వాకిలి వరకు వెళ్లి తిరిగి రావడం అలవాటుగా మారిపోయింది' అని విమర్శించారు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవడంలో భారత్ విఫలమైందని, గతంలో చేసిన వ్యూహాత్మక తప్పిదాలనే మళ్లీ చేస్తున్నదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 'చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోలేదు కాబట్టే.. అదే పునరావృతం అవుతున్నది' అని వ్యాఖ్యానించారు. ఇందుకు పలు ఉదాహరణలను పేర్కొన్నారు. '1972లో పాకిస్థాన్ నుంచి ఎలాంటి లబ్ధి పొందకుండానే చర్చలు ముగించాం. 2021లో ఎలాంటి బేరసారాలు చేయకుండానే వ్యూహాత్మకంగా కీలకమైన కైలాశ్ పర్వతాలను ఖాళీ చేశాం. లద్దాఖ్‌లో చైనా నిర్దేశించిన బఫర్ జోన్లకు అంగీకరించాం. ఇప్పుడు ఆపరేషన్ సిందూర్‌లో కాల్పుల విరమణకు ఒప్పుకున్నాం' అని ఉదహరించారు. పహల్గాం దాడిలో 26 మంది భర్తల మరణాలకు ప్రతీకారంగా 'సిందూర్' అనే గంభీరమైన పేరుతో ఆపరేషన్ చేపట్టారని గుర్తుచేశారు. పాకిస్థాన్ నుంచి కాల్పులు జరిపినా, మిస్సైళ్లు ప్రయోగించినా పట్టించుకోకుండా మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. 'ఈ రోజు తీసుకున్న నిర్ణయంపై చరిత్ర కనికరం చూపదు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. మొత్తంగా ఆపరేషన్ సిందూర్‌కు ఇలా ముగింపు ఇవ్వడం వ్యూహాత్మక తప్పిదంగా మిగిలిపోతుందని, ఇది సమాధానాల కన్నా ప్రశ్నలనే ఎక్కువగా మిగిల్చిందన్నారు.

## రావల్పిండిలోనూ మన సైనిక గర్జన

**ఉగ్రమూకలపై ప్రతీకారం తీర్చుకున్నాం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్**

న్యూఢిల్లీ/లక్నో, మే 11: భారత వ్యతిరేక శక్తులపై మన సైనిక బలగాలు ప్రతీకారం తీర్చుకున్నాయని, పహల్గాం ఉగ్రదాడి బాధితులకు న్యాయం జరిగిందని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఆపరేషన్ 'సిందూర్'లో మన సైనిక బలగాల సింహగర్జన కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాకుండా పాకిస్థాన్ సైనికదళ ప్రధాన కార్యాలయమున్న రావల్పిండిలోనూ ఎంతో బిగ్గరగా ప్రతిధ్వనించిందని చెప్పారు.

### బ్రహ్మోస్ క్షిపణి తయారీ కేంద్రం ప్రారంభం

లక్నోలో బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ క్షిపణుల ఉత్పత్తి కేంద్రాన్ని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.300 కోట్ల వ్యయంతో ఏర్పాటైన ఈ కేంద్రంలో ఏటా 80 నుంచి 100 బ్రహ్మోస్ క్షిపణులను ఉత్పత్తి చేస్తారు. తదుపరి తరం బ్రహ్మోస్ క్షిపణులను ఇక్కడే తయారు చేయనున్నారు.

# ఉగ్ర స్థావరాలపై బ్రహ్మోస్త్రం!

**ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ క్షిపణి వినియోగం!**

**ఇండో-పాక్ బోర్డర్‌లో కనిపించిన మిసైల్ బూస్టర్, నోస్ క్యాప్**

**ధ్రువీకరించని ప్రభుత్వం**

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'లో ఉగ్రవాద స్థావరాలపై బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్‌ను ప్రయోగించినట్లు కనిపిస్తున్నది. రాజస్థాన్‌లోని బికనీర్ సమీపంలో ఈ క్షిపణికి సంబంధించిన మిసైల్ బూస్టర్, నోస్ క్యాప్ ఉన్నట్లు కొందరు గుర్తించారు. ఈ మిసైల్‌ను ప్రయోగించిన కాసేపటి తర్వాత కొన్ని విడి భాగాలను ఇండో-పాక్ సరిహద్దుల్లోని మారుమూల ప్రాంతంలో గుర్తించారు. పాకిస్థాన్‌లోని బహావల్‌పూర్‌లో ఉన్న జైషే మహమ్మద్ ఉగ్రవాద నెట్‌వర్క్ హెడ్‌క్వార్టర్‌పై దీనిని ప్రయోగించినట్లు భావిస్తున్నారు. అయితే, ఈ విషయాన్ని భారత ప్రభుత్వం ధ్రువీకరించలేదు.

### అసలు ఏమిటి ఈ బ్రహ్మోస్?

బ్రహ్మోస్ అనేది లాంగ్ రేంజ్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్. ఇది అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించగలదు. ఇది 'ఫైర్ అండ్ ఫర్గెట్ సూత్రం' ఆధారంగా పని చేస్తుంది. లక్ష్యాన్ని చేరుకునే మార్గంలో రకరకాలుగా ఇది ప్రయాణిస్తుంది. కైనెటిక్ ఎనర్జీ (చలన శక్తి) భారీగా ఉండటం వల్ల లక్ష్యాన్ని విధ్వంసం చేసే సత్తా బ్రహ్మోస్ క్షిపణికి అత్యధికంగా ఉంటుంది. బ్రహ్మోస్ క్షిపణిని స్టెల్త్ టెక్నాలజీతో తయారు చేశారు. అంటే, దీనిని శత్రు రాడార్లు, ఇన్‌ఫ్రారెడ్ సెన్సర్లు, సోనార్ వంటి వ్యవస్థలు గుర్తించడం కష్టం. దీంతో పాటు అడ్వాన్స్‌డ్ గైడెన్స్ సిస్టమ్, దానిలోనే సాఫ్ట్‌వేర్ కూడా ఉంటుంది. అత్యంత కచ్చితత్వంతో, ప్రతికూల పరిస్థితుల్లో నిలదొక్కుకుని పని చేసే విధంగా ఈ క్షిపణిని రూపొందించారు. 290 కి.మీ. పరిధిలోని లక్ష్యాన్ని ఇది ఛేదించగలదు. ప్రయాణ కాలంలో మొదటి నుంచి చివరి వరకు సూపర్‌సానిక్ వేగాన్ని కొనసాగించగలదు. ప్రయాణ కాలం తక్కువగా ఉండేలా, లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించేలా, ప్రస్తుత రక్షణ వ్యవస్థలు అడ్డుకునే అవకాశాలు అతి కనిష్టంగా ఉండేలా తయారు చేశారు.




**బ్రహ్మోస్ ప్రత్యేకతలు**

- **రేంజ్:** 450 కి.మీ.కుపైగా (800 కి.మీ. వరకు వేరియంట్స్‌ను పరీక్షించినట్లు వార్తలు వచ్చాయి)
- **వేగం:** సూపర్‌సానిక్ (మాక్ 2.8-3.0). ఫలితంగా దీనిని అడ్డుకోవడం చాలా కష్టం.
- **ప్రయోగ వేదిక:** గగనతలం, భూతలం, సముద్రం, జలాంతర్గామి నుంచి ప్రయోగించవచ్చు. ఏఎల్‌సీఎం వెర్షన్‌ను ఎస్‌యూ-30ఎంకే నుంచి ప్రయోగించారు.
- **కచ్చితత్వం:** అడ్వాన్స్‌డ్ గైడెన్స్, నావిగేషన్‌తో పిన్‌పాయింట్‌కు దగ్గరగా.
- **పేలోడ్:** అత్యంత భారీగా పేలే వార్‌హెడ్ (200-300 కేజీలు). కఠినమైన లక్ష్యాలను ఛేదించడానికి ఇది ఉపయోగపడుతుంది.

## కశ్మీర్‌ను పాక్ అంతర్జాతీయం చేసింది

**సీఎం ఒమర్ అబ్దుల్లా**

శ్రీనగర్: ఏళ్ల తరబడి చేసిన ఆర్థిక, దౌత్యపరమైన కృషిని పహల్గాం దాడి ఘటన ముక్కలు, చెక్కలు చేసిందని, చాలా కాలం తర్వాత కోలుకున్న రాష్ట్ర పర్యాటక రంగానికి ఇది తీవ్ర కుదుపు తెచ్చిందని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అన్నారు. అంతేకాకుండా కశ్మీర్‌ను అంతర్జాతీయ సమాజంలో ఎత్తి చూపేలా చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం ఈ ప్రాంతం పర్యాటకులతో కళకళలాడేదని, ఆర్థిక రంగం అభివృద్ధి చెందిందని, పిల్లలు పాఠశాలలకు వెళ్లేవారని, విమానాశ్రయాలలో రోజుకు 50-60 విమానాలు రాకపోకలు సాగించేవని ఆయన చెప్పారు. ఇప్పుడు కశ్మీర్ లోయ అంతా బోసిపోయి ఖాళీగా కన్పిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ విషయంగా చేసిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగినప్పటికీ వాటి మధ్య పలు అంశాలకు సంబంధించిన స్పర్థలు అలాగే కొనసాగుతున్నాయని చెప్పారు. ఏప్రిల్ 22న జరిగిన ఊచకోత లోయలోని పరిస్థితులనే పూర్తిగా మార్చివేసిందని ఆయన తెలిపారు. 'మనం ఊహించని చోట మనం ఉన్నాం.. మనం ఊహించని రక్తపాతంలో బాధలు పడుతున్న చోట మనం ఉన్నాం' అని ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు.

# సైన్యంపై ప్రశంస.. మోదీపై మౌనం

**ఆపరేషన్ సిందూర్‌ని ప్రశంసించిన ఆరెస్సెస్**

**భాగవత్, దత్తాత్రేయ హోసబాలే పేరున ప్రకటన**

**అందులో మోదీ పేరు లేకుండా జాగ్రత్తలు**




న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూనే మోదీ పేరు ప్రస్తావించకుండా మౌనం పాటించడం దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైందని 'ది టెలిగ్రాఫ్ ఆన్‌లైన్'కు రాసిన వ్యాసంలో జేపీ యాదవ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌ను ప్రోత్సహించిన ఉగ్రవాదులు, వారికి మద్దతునిచ్చే వ్యవస్థపై 'ఆపరేషన్ సిందూర్' పేరుతో చర్యలు తీసుకున్న ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నామని, మన సైనిక బలగాలను అభినందిస్తున్నామంటూ భాగవత్, ఆరెస్సెస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబాలే పేరున జారీ అయిన ప్రకటనను ప్రస్తావిస్తూ.. అందులో మోదీ పేరు లేకపోవడాన్ని వ్యాసకర్త ఎత్తి చూపారు. వ్యక్తులను నెత్తికెక్కించుకోకపోవడం సంఘ్‌కు అలవాటే అయినప్పటికీ మోదీ విషయంలో భాగవత్ మౌనం వారిద్దరి మధ్య కొనసాగుతున్న అధికార పోరును ప్రతిబింబిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు.

### ఎడ ముఖం.. పెడ ముఖం

గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ దారుణంగా విఫలమైన తర్వాత భాగవత్, మోదీ ఎడ ముఖం, పెడ ముఖంలా ఉన్నారు. మోదీ అతి విశ్వాసాన్ని భాగవత్ దుయ్యబట్టారు. బీజేపీ తదుపరి అధ్యక్షుడి ఎన్నిక జాప్యానికి వీరిద్దరి మధ్య పోరే కారణమని వ్యాసకర్త అభిప్రాయపడ్డారు. పార్టీ అధ్యక్షుడి ఎంపికపై నెలకొన్న ప్రతిష్ఠంభన వారి అహంకారానికి తాజా ఉదాహరణ అని విమర్శించారు. మోదీకి, ఆయన నంబర్ 2 హోం మంత్రి అమిత్‌షాకు 'రబ్బర్ స్టాంప్'లాగా విధేయతతో ఉండే పార్టీ చీఫ్‌ను ఇచ్చేందుకు ఆరెస్సెస్ చీఫ్ విముఖత చూపడం కూడా ఈ జాప్యానికి మరో కారణంగా పేర్కొన్నారు. చాలా కాలం క్రితమే జరగాల్సిన అధ్యక్షుడి నియామకం ఈ కారణంగానే ఆగిపోయిందన్నారు. అయితే, పాకిస్థాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలు కూడా బీజేపీ అధ్యక్షుడి ఎన్నిక మరింత ఆలస్యం కావడానికి కారణం కావొచ్చని జేపీ యాదవ్ పేర్కొన్నారు.

### మోదీ పేరు రాకుండా జాగ్రత్త

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకోవడంలో మోదీ 'ధైర్యమైన, నిర్ణయాత్మక' నాయకత్వాన్ని ప్రశంసిస్తూ బీజేపీ, కాషాయ శ్రేణులు 'ఆపరేషన్ సిందూర్'ను ఉదహరిస్తున్నాయి. ఆరెస్సెస్ ప్రకటన కూడా సైనిక చర్యను అభినందించింది. హిందూ పర్యాటకులపై జరిగిన దారుణ హత్యాకాండలో బాధితులైన కుటుంబాలకు, మొత్తం దేశానికి న్యాయం చేసేందుకు చేపట్టిన ఈ చర్య దేశ ఆత్మగౌరవాన్ని, నైతికతను పెంచిందన్న ఆరెస్సెస్.. ఆ ప్రకటనలో మోదీ పేరు రాకుండా జాగ్రత్త పడింది. 'పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి మౌలిక సదుపాయాలు, మద్దతుదారులపై సైనిక చర్య తీసుకోవడం దేశ భద్రతకు అనివార్యమైనదే అని మేము పూర్తిగా ఏకీభవిస్తున్నాం. ఈ జాతీయ సంక్షోభ సమయంలో దేశం మొత్తం కేంద్ర ప్రభుత్వం, సైనిక దళాల వెంట నిలుస్తుంది' అని ఆరెస్సెస్ ఆ ప్రకటనలో పేర్కొన్నది. ప్రతి పౌరుడు దేశభక్తిని చాటుకోవాలని విజ్ఞప్తి చేసింది. సామాజిక ఐక్యత, సామరస్యాన్ని దెబ్బతీసే జాతీయ వ్యతిరేక శక్తుల కుట్రల పట్ల జాగ్రత్తగా ఉండాలని పౌరులను కోరింది.



**ఆర్మీకి 25 వేల చెక్కు విరాళం**

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి తన పుట్టినరోజును పురస్కరించుకొని భారత సైన్యానికి రూ.25 వేల చెక్కును అందజేయనున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఆయన చెక్కును మీడియాకు చూపించారు. అంతకుముందు హనుమకొండలోని వేయిస్తంభాల గుడి నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు వీర జవాన్లకు నివాళులర్పిస్తూ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. - హనుమకొండ చౌరస్తా

# 'పుల్వామా దాడి' మా పనే

- పాక్ వైమానిక దళ అధికారి బహిరంగంగా అంగీకారం
- భారత్ ఆధారాలు సమర్పించినా బుకాయిస్తూ వచ్చిన పాక్

న్యూఢిల్లీ: పాకిస్థాన్ తన ద్వంద్వ వైఖరిని ప్రపంచం ముందు మరోమారు బహిరంగా బయటపెట్టుకుంది. పుల్వామా దాడికి, తమకు సంబంధం లేదంటూ ఇన్నాళ్లు బుకాయిస్తూ వచ్చిన దాయాది దేశం.. అది ఇప్పుడు తమ పనేనని స్వయంగా అంగీకరించింది. 2019లో జమ్ముకశ్మీర్‌లోని పుల్వామాలో జరిగిన బాంబుదాడిలో 40 మంది పారామిలటరీ సిబ్బంది మృతి చెందారు. ఇది పాక్ పనేనంటూ భారత్ అప్పట్లో సాక్ష్యాలు అందించినా తమకు సంబంధం లేదని బుకాయిస్తూ వచ్చింది. అయితే, ఇప్పుడు ఏకంగా అంతర్జాతీయ మీడియా సమక్షంలో



పుల్వామా దాడి తమ పనేనని అంగీకరించింది. పాకిస్థాన్ వైమానిక దళానికి (పీఏఎఫ్) చెందిన పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ జనరల్, ఎయిర్ వైస్ మార్షల్ ఔరంగజేబ్ అహ్మద్ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. పుల్వామాలో తమ వ్యూహాత్మక చతురతను ఇప్పటికే ప్రదర్శించామని, తమ కార్యదీక్షత ఏపాటిదో ఇప్పటికే చూపించామని పేర్కొన్నారు. తమ గగనతలం, భూభాగం, జలాలకు కానీ, ప్రజలకు కానీ ముప్పు వాటిల్లితే రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఔరంగజేబు వ్యాఖ్యలు పుల్వామా దాడిలో పాక్ ప్రమేయాన్ని అంగీకరించడమే కాకుండా, పహల్గాం దాడి విషయంలో పాక్ వైఖరిని తేటతెల్లం చేస్తున్నాయి.

## ఉక్రెయిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధం

- జెలెన్‌స్కీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రతిపాదన
- ముందు కాల్పుల విరమణ అమలు చేయాలన్న ఉక్రెయిన్

మాస్కో, కీవ్: ఉక్రెయిన్ శనివారం ప్రతిపాదించిన షరతులు లేని 30రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని అంగీకరించకపోతే మాస్కోపై ఒత్తిడి పెంచుతామని నాలుగు ప్రధాన యూరోపియన్ దేశాలు రష్యాపై ఒత్తిడి తెచ్చిన వేళ నేరుగా చర్చిద్దామని ఆదివారం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రతిపాదించారు. పుతిన్ ప్రతిపాదనను శాంతియుతమైన పరిష్కారం కోసం నిబద్ధతతో చేస్తున్న ప్రయత్నంగా రష్యా ప్రభుత్వ అధికార ప్రతినిధి పెస్కోవ్ అభివర్ణించారు. ఈ నెల 15న ఇస్తాంబుల్‌లో చర్చలకు రావాలని పుతిన్ ఆహ్వానించారు.

### సానుకూల పరిణామం

నేరుగా చర్చిద్దామన్న పుతిన్ ప్రతిపాదనను జెలెన్‌స్కీ సానుకూల పరిణామంగా అభివర్ణించారు. అయితే శాంతిచర్చలు జరిగే ముందు పూర్తిగా తాత్కాలిక కాల్పుల విరమణ జరగాలని అన్నారు. 'ఏ యుద్ధాన్ని అయినా నిజంగా ముగించడానికి మొదటి అడుగు కాల్పుల విరమణ. దీనికోసమే ప్రపంచమంతా ఎదురు చూస్తున్నది' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. తమ భూభాగంపై రష్యా 108 డ్రోన్లతో ఆదివారం దాడులకు పాల్పడిందని ఉక్రెయిన్ వైమానిక దళం తెలిపింది.

## దుబాయ్‌లో కేరళ వ్యక్తికి 8.5 కోట్ల జాక్‌పాట్

దుబాయ్, మే 11: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నివసిస్తున్న కేరళకు చెందిన 52 ఏండ్ల వ్యక్తికి అదృష్టం తలుపుతట్టింది. దుబాయ్ డ్యూటీ ఫ్రీ నిర్వహించిన మిలీనియం మిలియనీర్ డ్రాలో ఆయన ఏకంగా 'ఒక మిలియన్ అమెరికన్ డాలర్లు' (సుమారుగా రూ.8.5 కోట్లు) గెలుచుకున్నారు. తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, నమ్మినవారి మోసంతో సతమతమవుతున్న తరుణంలో ఈ జాక్‌పాట్ తగలటంతో ఆయన ఆనందానికి అవధులు లేకుండా పోయింది. యూఏఈలోని అజ్మాన్‌లో నివసిస్తున్న వేణుగోపాల్ ముల్లచ్చేరి, వృత్తి రీత్యా ఐటీ సపోర్ట్ స్పెషలిస్ట్. గత 15 సంవత్సరాలుగా ఆయన దుబాయ్ డ్యూటీ ఫ్రీ లాటరీలో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఏప్రిల్ 23న దుబాయ్ విమానాశ్రయంలో ఆయన కొనుగోలు చేసిన టికెట్‌కు ఈ భారీ మొత్తం దక్కింది. 'ఈ విజయం నా జీవితంలోని ఒక కష్టతరమైన అధ్యాయానికి ముగింపు పలికి, ఆశ, ఆనందంతో నిండిన కొత్త అధ్యయానికి నాంది పలికింది' అని అన్నారు.


